సాక్షి
వరంగల్
మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



వేయిస్తంభాల గుడిలో...

వేయిస్తంభాల ఆలయంలో ఈనెల 17 నుంచి 21 వరకు జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ శేషగిరి కోరారు. - 8లో



రెవెన్యూ వసూళ్లు పెంచాలి

రెవెన్యూ వసూళ్లు పెంచాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం $32^0/15^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతోపాటు సూర్యరశ్మితో చాలా వేడిగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కరాటేలో 'పేట'కు పతకాలు



వర్ధన్నపేట: వర్ధన్నపేట కరాటే అకాడమీలో శిక్షణ పొందిన క్రీడాకారులు ఏపీలో ఈనెల 9 నుంచి 12 వరకు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ సీఎం కప్–2023 పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు అకాడమీ నిర్వాహకుడు బి.రమేశ్ సోమవారం తెలి పారు. అండర్–15 విభాగంలో కె.జస్వంత్, బి.భరత్, ఎ.సంతోష్ బంగారు పతకాలు సాధించగా.. సిల్వర్ మెడల్స్‌ను బి.అశ్విత్, బి.ప్రశాంత్‌కుమార్, శరత్‌కుమార్, సుజిత్ సాధించారన్నారు. బ్రాంజ్ మెడల్‌ను ఎ.హరీశ్, జె.సతీష్, కె.హర్ష, బి.విశ్వం గెలుచుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రశ్నపత్రాల కుదింపుపై అవగాహన

రాయపర్తి: పదో తరగతిలో 11 నుంచి ఆరు పేపర్లకు ప్రశ్నపత్రాలను కుదించిన అంశంపై అవగాహన కల్పిస్తున్నట్లు డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి తెలిపారు. డీఈఓ వాసంతి ఆదేశాల ప్రకారం సోమవారం మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వంద శాతం ఫలితాలు సాధించేలా అవగాహన కల్పించినట్లు తెలిపారు. నూతన ప్రశ్నపత్రంపై బ్లూప్రింట్ ఆధారంగా మోడల్ ప్రశ్నపత్రాన్ని వివరించామన్నారు. 13 మండలాల్లోని 44 సెంటర్లలో ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏసీజీఈడీసీపీ నర్సింహారావు, ఎంఈఓ రంగయ్య, నోడల్ అధికారి జె.లింగారెడ్డి, వెంకటయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

వర్ధన్నపేట: ఇల్లంద గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పలు పనులను నేషనల్ వాటర్ అవార్డ్స్ బృందం సభ్యులు మోనిక, డి.చైతన్య సోమవారం సందర్శించారు. చెక్ డ్యాం, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, నర్సరీలు, హరితహారం, ఇంకుడు గుంతలు, పాం పాండ్స్‌లను పరిశీలించారు. సర్పంచ్ సుంకరి సాంబయ్య, ఏపీఓ నాగేశ్వర్‌రావు, ఉప సర్పంచ్ మడ్డి రాజ్‌కుమార్, ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్, పిట్టల జ్యోతి రమేశ్, పంచాయతీ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

అవార్డు నామినేషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్: మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మహిళలను రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసి.. అవార్డులు అందజేయడానికి నామినేషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు వారి పూర్తి వివరాల కాపీని కమిషనర్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, హైదరాబాద్ కార్యాలయం, మరో కాపీని జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం, వరంగల్‌లో ఈనెల 19 నాటికి సమర్పించాలని పేర్కొన్నారు.

గంగదేవిపల్లికొచ్చిన ఏపీ వాసులు

గీసుకొండ: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లా అమరాపురం మండలంలోని 14 గ్రామాల నుంచి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు 39 మంది సోమవారం సందర్శించారు. రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్‌డీటీ) ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి, ఆదర్శంగా నిలిచిన తీరుతెన్నులను పరిశీలించారు. ఆర్‌డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున్, ట్రైనర్ రామాంజనేయులు పాల్గొనగా.. వారికి గ్రామం గురించి జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, వనపర్తి కరుణాకర్, మేడిద సుశీల, గూడ సరోజన వివరించారు.

రమాదేవికి 'జూటూరి' స్మారక పురస్కారం



కాళోజీ సెంటర్: తెలుగు సాహిత్య సేవలో విశేష కృషి చేసిన రచయిత బాలబోయిన రమాదేవికి సూరేపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2022 సంవత్సరానికి జూటూరి విజయలక్ష్మి స్మారక పురస్కారాన్ని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ తాను రచించిన సాహిత్యాన్ని గుర్తించి మహిళా దినోత్సవం, సరోజినీ నాయుడు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ సత్కారం అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒకరికొకరై...

- ఏళ్లు గడిచినా చెరిగిపోని ప్రేమబంధం
- నాడు పెద్దలను ఎదిరించినా ఒడిదొడుకులు లేని జీవితం
- అనారోగ్య సమస్యల్లోనూ పాలుపంచుకుంటున్న జంటలు

నేడు ప్రేమికుల దినోత్సవం

వయసులో పరిపక్వత లేకున్నా వారిలో ప్రేమ చిగురించింది. చిన్ననాటి తరగతి గదులే ప్రేమబంధానికి పునాదులు వేశాయి. ఏళ్లు గడిచినకొద్దీ ఆ ప్రేమ పరిణయానికి దారి తీసింది. పెద్దలను ఒప్పించి.. మెప్పించి కొందరు.. తల్లిదండ్రులను ఎదిరించి మరికొందరు ఇలా పెళ్లిళ్లు చేసుకుని ఒక్కటయ్యారు. దాంపత్య జీవితాలను ఒడిదొడుకులు లేకుండా సాగిస్తూ.. కుటుంబ బాధ్యతలను సమర్థంగా మోస్తూ ప్రేమంటే ముళ్లబాట కాదు.. పూలబాట అని నిరూపిస్తున్నారు. భార్యాభర్తల్లో అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఒకరి ఆయుష్షును మరొకరు పోసుకుంటూ.. చేదోడు వాదోడుగా నిలుస్తూ ప్రేమ గొప్పతనాన్ని చాటి చెబుతున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రేమ పెళ్లిళ్లు చేసుకున్న పలువురి కథనాలు.

భర్తకు పునర్జన్మనిచ్చింది..



ఆత్మకూరు: శ్రీవాణి, కోటేశ్వర్‌లది పరకాల మండలం నాగారం గ్రామం. ఒకే గ్రామం కావడం.. ప్రేమ కాస్త పెళ్లి వరకు వెళ్లింది. 1999లో పెళ్లి చేసుకొని ఆత్మకూరు మండలం నీరుకుళ్లకు వచ్చి వైద్య వృత్తి చేసుకుంటూ స్థిరపడ్డారు. ఆనందంగా సాగుతున్న వారి జీవితంలో 2010లో భారీ కుదుపు వచ్చింది. కోటేశ్వర్‌కు రెండు కిడ్నీలు చెడిపోయాయి. రెండేళ్లపాటు డయాలసిస్ చేయించుకున్నాడు. ఇక ఆరోగ్యం సహకరించని పరిస్థితి. తనలో సగమైన భార్య శ్రీవాణి తన కిడ్నీ ఇచ్చింది. 24 ఏళ్లుగా భర్త వెన్నంటే ఉంటోంది. కోటేశ్వర్ ఎంతో మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు.

మతాలు వేరైనా...



యూసుఫ్, పద్మ(పర్వీన్), పిల్లలు

రాయపర్తి: మతాలు, కులాలు వేరైనా ఇద్దరి మనసులు కలిశాయి. మనువాడేందుకు పెద్దలు అంగీకరించకపోయినా ప్రేమ పెళ్లితో ఒక్కటైన ఆ దంపతులు అరమరికలు లేని జీవనం సాగిస్తున్నారు. రాయపర్తి మండల కేంద్రానికి చెందిన మహ్మద్ యూసుఫ్, బండారి పద్మ అలియాస్ పర్వీన్ పాఠశాల స్థాయిలోనే ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఈ విషయాన్ని ఇంట్లో పెద్దలకు చెప్పినా అంగీకరించకపోవడంతో 1997, ఏప్రిల్ 27న వరంగల్‌లోని శివనగర్‌లో తమ బంధువుల ఇంట్లో ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వారి దాంపత్య జీవితంలో ముగ్గురు కుమార్తెలు జన్మించగా.. హసీనా(దివ్యాంగురాలు), రేష్మ పాలిటెక్నిక్ కోర్సు చదువుతుండగా.. మూడో కుమార్తె చాందిని 10వ తరగతి చదువుతోంది. యూసుఫ్ కుటుంబాన్ని పోషించుకునేందుకు ఆర్టిస్టుగా జీవనం సాగిస్తున్నాడు. పొద్దంతా కష్టపడుతున్నా కుటుంబాన్ని మాత్రం కంటికి రెప్పలా కాపాడుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు యూసుఫ్. కాగా.. మతాలు వైరేనప్పటికీ 26 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నామని పద్మ(పర్వీన్) తెలిపింది. మాకు ఎలాంటి ప్రభుత్వ సహాయం అందకపోవడమే ఇబ్బందిగా ఉంది.

కిడ్నీతో ప్రాణం పోసింది..



పరుపాటి వనమాల–కరుణాకర్‌రెడ్డి దంపతులు

దుగ్గొండి: 'తనలో సగ భాగం.. నా భర్తను నేనే కాపాడుకుంటా.. ఎవరి కిడ్నీ నా భర్తకు అమర్చాల్సిన అవసరం లేదు'.. అని తొమ్మిదేళ్ల క్రితం భర్తకు తన కిడ్నీ ఇచ్చి కాపాడుకుంది వనమాల. మధిర గ్రామానికి చెందిన పరుపాటి కరుణాకర్‌రెడ్డి–వనమాల దంపతులు చాలా దగ్గరి బంధువులు. పైగా మేనమామ కూతురు కావడంతో చిన్ననాటి నుంచే పెళ్లి చేసుకోవాలనుకున్నారు. పెద్దల అంగీకారంతో 1992లో వివాహం చేసుకున్నారు. అన్యోన్యంగా సాగిపోతున్న వారి దాంపత్య జీవితంలో ఇద్దరు కుమారులు జన్మించారు. అంతలోనే కరుణాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోగా.. కిడ్నీలు పాడైపోయాయని వైద్యులు తేల్చారు. కిడ్నీ మారిస్తేగాని బతకడని చెప్పారు. కుటుంబ సభ్యులు అక్కడక్కడా కిడ్నీ దాతల కోసం వెతికారు. అయితే వనమాల మాత్రం భర్తకు తన కిడ్నీ ఇచ్చి ప్రాణం నిలబెట్టుకుంటానని పట్టుబట్టింది. దీంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో 2014లో కిడ్నీ ఆపరేషన్ జరిగింది. వనమాల ఇచ్చిన కిడ్నీతో కరుణాకర్ పునర్జన్మ పొందాడు. తొమ్మిదేళ్లుగా దంపతులిద్దరూ ఆదర్శంగా జీవనం సాగిస్తున్నారు. వనమాల తన భర్తపై ఉన్న ప్రేమతో తన అవయవాన్ని దానం చేసి ప్రేమను చాటుకుంది. భర్త కోసం భార్య, భార్య కోసం భర్త అనే సామెతకు జీవం పోసింది.

తడబడినా.. నిలబడి..



వేణుగోపాల్‌రావు–సృజనరెడ్డి దంపతులు

ఖానాపురం: పోలియో ఆమెను నిలబడలేకుండా చేసింది. రెండు కాళ్లు చచ్చుబడిపోయినా తన జీవితమెలా అని తడబడింది. పట్టు వదలకుండా పుస్తకాలతో కుస్తీ పట్టింది. తన జీవితం నిలబడేలా చేసుకుంది. ఈ క్రమంలోనే పై చదువులు చదువుతుండగా ఓ యువకుడితో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లికి దారితీసింది. చెన్నారావుపేటకు చెందిన అండ్ర సృజనారెడ్డికి చిన్నతనంలోనే పోలియో కారణంగా రెండు కాళ్లు చచ్చుబడి పోయాయి. అయినా పట్టుదలతో పదో తరగతి పూర్తి చేసింది. ఇంటర్ చదువుతున్న క్రమంలో ఖానాపురం మండలం అశోక్‌నగర్‌కు చెందిన పిన్నింటి వేణుగోపాల్‌రావుతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. ముందుగా ఏదైనా ఉద్యోగం సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకొని ఆ తర్వాత వివాహం చేసుకుందామని అనుకున్నారు. 2008లో ఉపాధ్యాయురాలిగా సృజనరెడ్డి ఉద్యోగం సాధించింది. ఆ తర్వాత వేణుగోపాల్‌రావు, సృజనరెడ్డి వివాహం చేసుకున్నారు. సృజనరెడ్డిని భర్త వేణుగోపాల్‌రావు పాఠశాలకు తీసుకెళ్లి సాయంత్రం తీసుకొస్తున్నాడు. వారికి ఇద్దరు కుమారులున్నారు. దివ్యాంగురాలు అయినప్పటికీ పట్టుదలే ఉన్నతంగా జీవించే స్థాయికి తీసుకొచ్చింది.

ఆత్మస్థైర్యంతో ముందుకు..

వరంగల్: రూపేశ్ విజయచందర్, సునీతలు దివ్యాంగులు. ఇద్దరి మనస్సులు కలవడంతో ప్రేమ వివాహం చేసుకున్నారు. రూపేశ్ పుట్టుకతోనే అంధుడు. 2002లో ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–4 పరీక్ష రాసి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సంపాదించాడు. 2011లో పరిచయమైన దివ్యాంగురాలైన సునీతతో ప్రేమలో పడి ఆదర్శ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఐనవోలు మండలంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. సునీత గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కృషి, పట్టుదల ఉంటే అంధత్వం అడ్డుకాదని, ఏదైనా సాధించవచ్చని నిరూపించారు రూపేశ్ దంపతులు.

- రూపేశ్ విజయచందర్, సునీత, హనుమకొండ



అగ్గిలా స్వచ్ఛమైంది..



తాళ్ల పద్మావతి ఫార్మసీ కాలేజీలో నిర్వహించిన డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థులు

- ప్రేమకు కులమతాలుండవు..
- ఇద్దరు అర్థం చేసుకుంటేనే జీవితం అర్థవంతం
- తల్లిదండ్రులనూ గౌరవించి మెప్పించాలి
- పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత ప్రేమపై 'సాక్షి' టాక్ షో
- తాళ్ల పద్మావతి ఫార్మా కాలేజీ స్టూడెంట్స్‌తో డిబేట్

కరీమాబాద్: 'తొలిచూపులోనే ప్రేమ పుట్టదు.. పరిచయంకొద్దీ అభిప్రాయాలు, అభిరుచులు కలిసిన తర్వాతే ఇద్దరిలో ప్రేమ చిగురిస్తుంది. తల్లిదండ్రుల ప్రేమ ఎంత స్వచ్ఛగా ఉంటుందో.. యువతీ యువకుల మధ్య చిగురించే ప్రేమ కూడా అంతే స్వచ్ఛతతో ఉండాలి. అగ్గిలా స్వచ్ఛమైనదై ఉండాలి. ప్రేమకు కులమతాలు ఉండవు. పెళ్లికి ముందు ప్రేమ వ్యవహారంపై ఒక రకమైన అభిప్రాయం ఉంటే.. పెళ్లి తర్వాత భవిష్యత్‌ను మలచుకున్న తీరునుబట్టి సమాజంలో మరో రకమైన గౌరవం చూపుతారు. అర్థం చేసుకుంటే జీవితం అర్థవంతంగా ఉంటుంది. పెళ్లికి ముందే ప్రేమలు 90 శాతం ఫెయిల్యూర్ అవుతుంటే.. 10 శాతమే నిలబడుతున్నాయి' అని 'సాక్షి' టాక్ షోలో పలువురు విద్యార్థినీ విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మంగళవారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వరంగల్‌లోని తాళ్లపద్మావతి ఫార్మాస్యూటికల్ కాలేజీలో సోమవారం 'పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత ప్రేమ'పై 'సాక్షి' టాక్ షో నిర్వహించింది. ఇక పెద్దలు కుదిర్చి చేసిన వివాహాలు కూడా ఇప్పుడు ప్రేమబాట పడుతున్నాయి.

ధైర్యం ఉంటేనే.. : డి.శ్రీజ



పెళ్లి తర్వాత ప్రేమ ఉండాలి. నిజమైన ప్రేమ ఉంటేనే పెళ్లి చేసుకోవాలి. పెద్దలను ఒప్పించే ధైర్యం ఉంటేనే ప్రేమించాలి. ఒక్కోసారి చిన్న చిన్న విషయాలకే గొడవలు పడుతూ ప్రాణాలు తీస్తున్నారు. చంపడం అనేది కరెక్టు కాదు. ప్రేమలో ఇద్దరికీ మెచ్యూరిటీ అవసరం.

కులమతాలుండవు..: జి.అక్షిత



ప్రేమించడం ఒక్కటే కాకుండా ఆ విషయాన్ని పేరెంట్స్‌కు చెప్పి వారిని ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. ప్రేమకు కులమతాలుండవు. కులాంతర వివాహాల విషయంలో అబ్బాయిలను చంపుతున్నారు. అది తప్పు. మారుతున్న సమాజానికి అనుగుణంగా మార్పు రావాలి.

కలిసి ఉండేది ప్రేమ..: కె.మవర్ష, బీ ఫార్మసీ, థర్డ్ ఇయర్



ప్రేమ విషయంలో తల్లిదండ్రులు ఒప్పుకోరు. ప్రస్తుత సమాజంలో పెళ్లికి ముందు వేరేలా.. తర్వాత మరోలా చూస్తారు. పెళ్లి తర్వాత ప్రేమకు విలువ ఎక్కువ ఉంటుంది. పెళ్లి తర్వాత సమస్యలు వచ్చినప్పుడు కలిసి ఉంచేది ప్రేమ. ముందుగా మన భవిష్యత్ గురించి ఆలోచించాలి.

అవగాహన ముఖ్యం..: జె.ఉమ



ప్రేమ విషయంలో ఇద్దరి మధ్య అవగాహన ముఖ్యం. ప్రేమలో ఉన్నప్పుడు చాటింగ్‌లుంటాయి. పెళ్లి తర్వాత బాధ్యతలుంటాయి. కుటుంబాన్ని పోషించుకోవాలనే ఆలోచన వస్తుంది. ప్రేమ పెళ్లి విషయంలో 95 శాతం ఫెయిలవుతున్నాయి. ఏ విషయంలోనైనా ఓపెన్‌గా ఉండాలి.

మొదట్లో చాటింగే..: పి.నితిన్



ప్రేమించుకునే మొదట్లో చాటింగ్ మొదలవుతుంది. తర్వాత వీడియో కాల్స్, పార్కులు, సినిమాలకు వెళతారు. చదువుకునే టైం కాబట్టి సమయం ఎక్కువగా ఉంటుంది. సంపాదన ఆలోచన ఉండదు కాబట్టి ప్రేమలోనే మునిగిపోతాం. పెళ్లి తర్వాత వేరే ఆలోచనలు రావు.

అమ్మానాన్నలా ఉండాలి..: జి.హరిణి



ప్రేమ విషయంలో అమ్మానాన్నలను మరిపించేలా ఉండాలి. ఆ ప్రేమ కూడా స్వచ్ఛతగా ఉండాలి. ఇద్దరిలోనూ కోపం, జెలసీ ఉండొద్దు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ అభిప్రాయాలను కూడా పరస్పరం గౌరవించుకోవాలి. అప్పుడే ఎలాంటి సమస్యలు ఉండవు.

సెటిల్ అయ్యాకే..: ఇ.భరత్



పెళ్లికి ముందు బాధ్యతలుండవు. మొదట్లో ప్రేమ ఉన్నప్పటికీ తర్వాత పరిస్థితుల్లో డబ్బు అవసరం పెరుగుతుంది. అప్పుడే సమస్యలు మొదలవుతాయి. గొడవలు పెరుగుతాయి. ఏదైనా ఎవరి కాళ్లపై వారు నిలబడినప్పుడే ప్రేమ, పెళ్లి గురించి ఆలోచించాలి.

పాకాలకు గోదావరి జలాలు

- యాసంగిలో ఆయకట్టు కింద 18వేల ఎకరాలు
- అనధికారికంగా మరో 5వేల ఎకరాల సాగు



పాకాలకు వస్తున్న గోదావరి జలాలు

ఖానాపురం: పాకాల ఆయకట్టు కింద యాసంగి పంటల సాగుకు అధికారులు సోమవారం నీటిని విడుదల చేశారు. పాకాల చెరువు కింద వర్షాకాలంలో 29,500 ఎకరాల వరి పంట సాగవుతుంది. యాసంగి సీజన్‌లో చెరువులో ఉన్న నీటి నిల్వ ఆధారంగా తైబందీ నిర్ణయించి.. పంటల సాగుకు నీటిని విడుదల చేస్తారు. అయితే పాకాల ఆయకట్టు (ఖానాపురం) పరిధిలో 18వేల ఎకరాల పూర్తిస్థాయి పంటల సాగుకు అధికారులు, ప్రజాప్రతినిధులు తైబందీ నిర్ణయించారు. దీంతోపాటు అనధికారికంగా మరో 5వేల ఎకరాల వరకు రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయకట్టు పరిధిలో వరి నాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం పాకాల సరస్సులో 19 ఫీట్ల నీరు ఉండడంతో రైతులకు నీటి విషయంలో ఇబ్బందులు ఏర్పడొద్దనే ఉద్దేశంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గోదావరి జలాలను పాకాలకు సోమవారం విడుదల చేయించగా.. చెరువులోకి చేరుతున్నాయి. పంట కాలం పూర్తయ్యే వరకు రైతులకు సాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే.. ప్రజాప్రతినిధులు, అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. దీంతో ఆయకట్టు పరిధిలోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. పాకాలకు గోదావరి జలాలు వస్తుండడంతో సోమవారం కీర్యతండా శివారులో ఎంపీపీ ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పూజలు చేశారు.

పంట పండినట్లే..



రంగాపురం శివారులో నేను 9 ఎకరాల వరి పంట సాగు చేశా. గతంలో ఎన్నడూ లేని విధంగా పాకాల ఆయకట్టు కింద పూర్తిస్థాయిలో వరి పంట సాగవుతుంది. నీళ్లు అందుతాయో.. లేదో.. అనే ఆందోళన ఉండేది. కానీ.. పాకాల చెరువులోకి గోదావరి జలాలు వస్తుండడంతో పంటలు పండుతాయనే ధీమా కలిగింది.

- బందారపు శ్రీనివాస్, రైతు రంగాపురం

ఉర్సు ఉత్సవాలు షురూ
రోహిణిలో అరుదైన శస్త్ర చికిత్స
జేఎల్ఎం పోస్టులు భర్తీ చేయాలి
కూరగాయల సాగు లాభదాయకం
- వివరాలు 10లో

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ బి.గోపి
- ప్రజావాణిలో 63 అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ

వరంగల్ రూరల్: పలు సమస్యలపై ప్రజలు ఇచ్చే వినతులను పరిశీలించి.. త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణిలో కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 63 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి.. బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేయాలన్నారు. అలాగే గీసుగొండ మండలంలో వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న విలేకరులకు 125 గజాల ఇంటి స్థలాలు ఇవ్వాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కలెక్టర్ గోపికి రాసిన లేఖను సోమవారం ప్రజావాణిలో విలేకరులు అందజేశారు.

అకారణంగా బహిష్కరించారు..

ఇల్లంద గ్రామంలో ఇంటి దారి విషయంలో తలెత్తిన వివాదంతో తన పుట్టింటి వారిని కుల బహిష్కరణ చేశారని, దీంతో తన పుట్టింటికి వెళ్లినందుకు నన్ను, నా భర్తను కూడా కుల బహిష్కరణ చేశారని కందుల రమాదేవి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

- కందుల రమాదేవి, ఇల్లంద



ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం..



తన పేర ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఖిలా వరంగల్ తహసీల్ చుట్టూ తిరుగుతున్నా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని, వెంటనే సర్టిఫికెట్ ఇప్పించాలని కుసుమ స్వప్న వినతిపత్రం సమర్పించింది.

- కుసుమ స్వప్న, ఉర్సు కరీమాబాద్, వరంగల్

నా భూమి కాజేయాలని చూస్తున్నారు..



దేశాయిపేట డాక్టర్స్ కాలనీకి చెందిన చింతం సంతోష్, మధుసూదన్, సూర్యనారాయణ, రజనీకాంత్, శ్రీలత, మధుకర్‌రావు, రామ్మోహన్, పద్మనాభం తదితరులు దళితుడినైన నా భూమిని కాజేయాలని చూస్తున్నారని వినతిపత్రం సమర్పించారు.

- జన్ను నూతన్‌బాబు, దేశాయిపేట

ఆర్థికంగా బలోపేతం కావాలి

వరంగల్ రూరల్: ప్రతి ఒక్కరు ఖర్చులు తగ్గించుకొని పొదుపు చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు–2023ను పురస్కరించుకుని లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు కిలోమీటర్ల వాకథాన్‌ను నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ఏకశిల పార్కు వరకు కొనసాగిన వాకథాన్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ గోపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 17 వరకు జిల్లాలోని అన్ని బ్యాంకుల ద్వారా ఆర్థిక అక్షరాస్యత క్యాంపులు వివిధ గ్రామ పంచాయతీలు, మున్సిపల్ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఆర్థిక మోసాలకు గురైన వారు 1930, 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు హవేలి, యూబీఐ డిప్యూటీ ఆర్ఎం వజీర్ సుల్తాన్, కెనరా బ్యాంక్ ఆర్ఎం మాధవి, శ్రీనివాస్, డీసీసీబీ ఏజీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

క్లుప్తంగా

కలుపు మందు కొడితే..

- వరి కుదుళ్లు కుళ్లి పోయాయి..
- లబోదిబోమంటున్న బాధిత రైతు నగేష్



మరిపెడ రూరల్: కలుపు మందని కొడితే.. వరిపాలం కుదుళ్లు కుళ్లిపోయి చస్తుంది. ఈ సంఘటన మమహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్లలో చోటు చేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం.. ఎడ్జెర్ల గ్రామానికి చెందిన రైతు గణగాని నగేష్ తనకున్న 6 ఎకరాల భూమిలో యాసంగి వరిపొలం సాగు చేశాడు. పొలంలో కలుపు పుట్టిందని కురవి మండలంలోని ఓ పురుగుల మందు షాపులో జిట్స్ ప్యాకెట్, విల్ గోల్డ్ డబ్బాతో ఉన్న మందులు ఇచ్చి 5 ఎకరాలకు 20 పంపుల చొప్పున పిచికారీ చేయాలని ఫర్టిలైజర్ యజమాని సూచించినట్లుగా 12 రోజుల క్రితం పిచికారీ చేశాడు. అప్పటి నుంచి వరి పొలమంతా కుదుళ్లు కుళ్లిపోయి సచ్చిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నకిలీ పురుగు మందులను అంటగట్టిన కంపెనీపై చర్యలు తీసుకొని నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను నగేష్ వేడుకుంటున్నాడు.

వ్యక్తి ఆత్మహత్య

వర్ధన్నపేట: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి ఇల్లంద గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రామారావు కథనం ప్రకారం మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన ఆకుల రాజుగౌడ్ (48) మద్యానికి బానిస అయ్యాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను దూషించాడు. ఇంట్లో తిట్లను వింటూ పక్కనే ఉన్న గదిలో భార్య, చిన్న కుమారుడు పడుకున్నారు. తిట్లు ఆగి పోయే సరికి పడుకున్నాడా? అని చూడడానికి రాత్రి 11.30 గంటల సమయంలో బయటకు రాగా రేకుల షెడ్డులోని ఇనుప పైపులకు చీరతో ఉరివేసుకుని వేళాడుతూ కనిపించాడు. కాపాడడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సోమవారం మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేరస్తుడికి జైలు శిక్ష

ఎల్కతుర్తి: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి సంవత్సరం జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన ముప్పు లచ్చయ్య అనే వ్యక్తి 2013లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నేరం రుజువు కావడంతో సోమవారం హనుమకొండ ఫోర్త్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సరిత సంవత్సరం జైలుతో పాటు రూ. 1,500 జరిమానా విధించినట్లు తెలిపారు.



నేడు వాలంటైన్స్ డే..

వరంగల్ మహానగరంలో నేడు (మంగళవారం) యువతీ, యువకులు ఆనందంగా వాలంటైన్స్ డే జరుపుకోనున్నారు. ఇప్పటికే ప్రేమికులు వైభవంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రేమికుడికి ఇచ్చే గులాబీ, ఇతర బహుమతులను సిద్ధం చేసుకున్నారు.

త్యాగానికి గుర్తుగా వాలంటైన్స్ డే..

క్రీస్తు పూర్వం 270వ సంవత్సరంలో రోమన్ చక్రవర్తి రెండో క్లాడియస్ దేశంలోని సైనికులు పెళ్లిళ్లు చేసుకుంటే ఏకాగ్రతతో యుద్ధం చేయలేరని పెళ్లిళ్లు నిషేధించారు. కానీ సెయింట్ వాలంటైన్ అనే సైనికుడు సైనికులను ప్రేమించేలా ప్రోత్సహించి పెళ్లిళ్లు చేశాడు. దాన్ని సహించలేని రాజు వాలంటైన్‌ను ఫిబ్రవరి 14న ఉరితీశాడు. వాలంటైన్ త్యాగానికి గుర్తుగా ప్రపంచ ప్రేమికులందరూ నాటి నుంచి ఆయన పేరుతో ప్రపంచ ప్రేమికుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు.

రంగుల ప్రేమ!

ప్రేమకు చిహ్నమే గులాబీ

- ప్రేయసికి ఇచ్చే బహుమతిలో ప్రథమస్థానం గులాబీదే
- గులాబీ రంగు పూలతోనే రెండు మనసులను ఒక్కటి చేసేది
- ఒక్కోరంగులో ఒక్కో అర్థం
- నేడు వాలంటైన్స్ డే

ఖిలా వరంగల్: ప్రేమ అనే రెండు అక్షరాలు.. రెండు హృదయాలను కలిపేది. అంగీకారమైన, తిరస్కారమైన గులాబీ పువ్వే చెప్పేస్తుంది. తాను ఇచ్చిన గులాబీ అమ్మాయి జడలోకి వెళ్తే ఆమె మనసులో తనకు స్థానమిచ్చిందని అబ్బాయి భావిస్తాడు. అదే గులాబీ కాళ్ల దగ్గర పడితే ప్రేమకు రెడ్ సిగ్నల్ అని గుర్తించాలి. ప్రేమికుల దినోత్సవ వేళ అబ్బాయిలు తమ ప్రేమను వివిధ గులాబీ రంగుల పూలతో వ్యక్తపరుస్తారు.

రంగు రంగుకో కోడ్..!

ప్రేమలో వర్ణానికి ఓ వివరణ ఉంది. ప్రేమను వ్యక్తీకరించడానికి అబ్బాయిలు అమ్మాయిలకు ముందుగా ఇచ్చే అందమైన బహుమతి గులాబీ. పరిచయం నుంచి ప్రేమ చిగురించి, విరబూసే వరకు ప్రతి ఘట్టంలోను గులాబీలదే ప్రథమ స్థానం. గులాబీ ఒక్కోసారి ఒక్కో రంగులో ఉంటుంది. ఆ రంగుల ప్రేమ లక్షణాలను ఆపాదించింది కూడా యువతరమే.

తెలుపు..

నేనున్నది నీ కోసమే.. అని చెప్పడానికి తెల్ల గులాబీనిస్తారు. స్వచ్ఛమైన ప్రేమకు ఆమె సౌందర్యాన్ని తెల్ల గులాబీలు తెలియజేస్తాయి.

పసుపు..

పరిచయమైన తర్వాత ఇద్దరి మధ్య మొదలైన స్నేహానికి ప్రతీక పసుపు గులాబీలు ఇస్తుంటారు.

ఎరుపు..

ఎర్ర గులాబీ విరిసింది.. తొలి సారి.. నిన్ను కోరి.. అంటూ అందరు పాడుకోకపోవచ్చు. కానీ ఐ లవ్ యూ అంటూ ప్రేమను ప్రకటించుకునేది మాత్రం ఎర్ర గులాబీతోనే. ఇందులో ప్రేమ ఒక్కటే కాదు.. అందం, ధైర్యం, గౌరవం వంటి లక్షణాలు ఉంటాయన్నది ప్రేమికుల విశ్వాసం.



పింక్..

ఈ రంగు గులాబీని సంతోషం, మననం, గొప్పతనం, సౌమ్యం వంటి గుణాలకు చిహ్నంగా భావిస్తారు. అమ్మాయి తన ప్రేమను అంగీకరించిన తర్వాత కృతజ్ఞతలు తెలపడానికి ఇచ్చే బహుమానం పింక్ గులాబీ.

పసుపు గులాబీపై ఎరుపు చాయలు

పద్దానమ్మ ప్రేమలో మరి.. విద్దూరంగా ఉందిలే ఇదీ.. అని చెప్పడానికి ఇచ్చేది ఈ వర్ణం గులాబీ.

ఆరెంజ్ పగడపు రంగు..

చిన్న పలకరింపుతో మొదలైన మాటలు స్నేహ బంధానికి బీజం వేసి.. ఆ స్నేహం ప్రేమగా మారిన తర్వాత వివాహ బంధానికి ముడి వేయాలన్న భావనను వ్యక్తం చేయడం ఆరెంజ్ పగడపు రంగు గులాబీ చిహ్నం.

ఎరుపు, తెలుపు..

పెళ్లయిన తర్వాత దాంపత్యంలో అన్యోన్యతకు నిదర్శనం ఎరుపు, తెలుపు గులాబీల గుచ్ఛం. మనది ఒక గొప్ప జంట. అని ఒకరి భావాలను ఒకరు పంచుకునే సందర్భంలో ఇచ్చుకునే ఎరుపు, తెలుపు గులాబీల గుచ్ఛం.

ప్రేమకు త్యాగం పరిష్కారం కాదు

ప్రేమ విఫలమవడంతో బలవన్మరణాలకు పాల్పడుతున్న యువత

- గతేడాది కమిషనరేట్‌లో 11 మంది ఆత్మహత్య





వరంగల్ క్రైం: ప్రేమ.. బహుశ ఇది తెలియని మనిషి ఉండరు. ఏదో ఒక సమయంలో ఏ వయసులో నైన దీని బారిన పడక తప్పదెమో అనిపిస్తుంది. కానీ అదే ప్రేమ నేటి యువతను కానరాని లోకాలకు తీసుకుపోతుంది. ఒకప్పుడు ప్రేమంటే త్యాగం, అదృష్టం, ఒక అర్హత ఇలా ఏదో ఒక అంశానికి సంవత్సరాల తరబడి ఒకరినొకరు ఆరాదించేవారు. కాని నేటి ప్రేమలు మారుతున్న కాలంతో పరుగులు పెడుతూ వాట్సప్‌లో చాటింగ్, వీడియో కాల్స్‌తో పలకరింపులు, ఒక హాయ్, రెండు జోక్‌లు, చిన్ని చిన్న గొడవలు అంతలోనే బ్రేక్‌అప్‌లు.. ఇవి సర్వసాధారణం అయ్యాయి. కాని ప్రేమ గొప్పదనం మాత్రం తగ్గలేదు.

క్షణాల్లో మారుతున్న నిర్ణయాలు..

ప్రేమికులుగా తమను ఈ సమాజం అంగీకరించడం లేదనే న్యూనత భావంతో కొంత మంది ప్రేమికులు తమ ప్రాణాలను త్యాగం పేరుతో వదులుకుంటున్నారు. తల్లిదండ్రులు తమ ప్రేమను ఎక్కడ కాదంటారో అనే భయంతో ఆత్మహత్యల వైపు అడుగులు వేస్తున్నారు. జీవితంలో స్థిరపడకపోవడం, చదువుకున్న చదువుకు తగ్గ ఉద్యోగం రాకపోవడం, కులాలు, మతాలు వేరు కావడం ఇలా అనేక కారణాలు ప్రేమికుల ఆత్మహత్యలకు కారణాలు అవుతున్నాయి. అమ్మాయి చనువుగా మాట్లాడితే కూడా కొంత మంది దానిని ప్రేమ అనుకుంటున్నారు. చివరు ప్రపోజ్ చేస్తే నో అనడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొంత మంది తమకు దక్కని ప్రేమ మరెవ్వరికి దక్కవద్దని కసితో దాడులకు పాల్పడుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతేడాది ప్రేమ విఫలం కావడంతో 11 మంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ ఏడాది ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు.

ఒకరినొకరు అర్థం చేసుకోవడం లేదు..



తెలిసి తెలియని వయసులో చాలా మంది ఆకర్షణను ప్రేమ అనుకొని జీవితాన్ని ముందుకు సాగనివ్వడం లేదు. చదువుకోవాల్సిన వయసులో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇద్దరు ప్రేమికులు ఒకరి గురించి ఒకరు పూర్తిగా తెలుసుకోకుండానే ప్రేమలో పడటం, ఆతర్వాత పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకోవడం, రెండు సంవత్సరాల్లోనే విడిపోయి పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటేనే జీవితం ఆనందంగా ఉంటుంది.

-కన్నం కుమారస్వామి,
రూరల్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్

కలెక్టరేట్‌కు పరుగులు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్, నాయకులు

- చెరువు సర్వేకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువు సర్వే చేయాలని కోరుతూ అధికార పార్టీ నేతలు కలెక్టరేట్‌కు పరుగులు పెట్టారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'రూ.30 కోట్ల విలువైన చెరువు శిఖం కబ్జా' అనే కథనానికి అధికార పార్టీ నేతలు అలర్ట్ అయ్యారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు అటికం రవీందర్, విక్టర్‌బాబులు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమ కట్టడాలు ఎక్కువైనట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రహరీని నిర్మించి, హద్దులు నిర్ధారించాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రగట్టు దేవస్థాన కమిటీ చైర్మన్ చింతల లక్ష్మణ్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సాయి, దళిత బహుజన సాహిత్య అకాడమీ జిల్లా చైర్మన్ గాజుల గోవర్ధన్, బీఆర్ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శులు నాయకపు శ్రీనివాస్, సమ్మయ్య, దేవస్థాన ధర్మకర్త భరత్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



సూరయ్య మృతదేహం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయపుర ప్రాంతంలో ఓ భవన నిర్మాణం ఎదుట మట్టి పనులు చేస్తున్న వ్యక్తిని లారీ వెనుకవైపు నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు హన్మకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన కనకం సూరయ్య (42) బతుకుదెరువు కోసం హనుమకొండకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం లారీ డ్రైవర్ అజాగ్రత్తతో వెనక్కి చూడకుండా రివర్స్ తీయడంతో సూరయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

డీసీఎంను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

- ఒకరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడు చిరంజీవి

రాయపర్తి: నిలిచి ఉన్న డీసీఎంను వెనక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన రాయపర్తి మండలం కిష్టాపురం క్రాస్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి గ్రామానికి చెందిన బిర్రు చిరంజీవి వరంగల్ వైపునకు స్కూటీపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నిలిచి ఉన్న డీసీఎంను వెనక నుంచి ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు.

నమ్మించి...
బావను హత్య చేసిన మరదలు

- తండావాసులు నిలదీయడంతో నిజం ఒప్పుకున్న మహిళ
- మెడలో చెప్పుల దండ వేసి ఊరేగింపు



నిందితురాలి మెడలో చెప్పులదండ వేసి ఊరేగిస్తున్న తండావాసులు

డోర్నకల్: మరదలి ప్రవర్తన సరిగా లేకపోవడంతో మందలించిన బావను నమ్మించి మరో ఇద్దరి సాయంతో హత్య చేసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ శివారు మున్నేరువాగు సమీపంలో గత శుక్రవారం కుళ్లిన స్థితిలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం మిస్టరీలో సోమవారం కొత్త విషయం వెలుగుచూసింది. మరదలిపై అనుమానంతో తండావాసులు నిలదీయడంతో నిజం ఒప్పుకుంది. దీంతో కోపోద్రిక్తులైన తండావాసులు ఆమె మెడలో చెప్పుల దండ వేసి ఊరేగించారు. వివరాల్లోకి వెళ్తే.. డోర్నకల్ పట్టణ శివారు సిగ్నల్‌తండాకు చెందిన బానోత్ జగన్(30) ఈ నెల 2వ తేదీ నుంచి కనిపించడం లేదు. అవివాహితుడైన జగన్ హైదరాబాద్‌లో క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా ఈ నెల ఒకటవ తేదీన తండాకు వచ్చాడు. జగన్ సోదరుడు గోపి ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని భార్య తన ఇద్దరు పిల్లలను ఇతర ప్రాంతాల్లో పాఠశాలలో చదివిస్తూ తను ఒంటరిగా తండాలో ఉంటుంది. మరదలి ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో జగన్ తరచూ మందలించేవాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి నుంచి జగన్ కనిపించకపోవడంతో సోమవారం తండావాసులు తన మరదలిపై అనుమానంతో గట్టిగా నిలదీశారు. దీంతో జరిగిన విషయాన్ని తండావాసులకు వివరించింది. తన ప్రవర్తనపై బావ జగన్ తరచూ ప్రశ్నించేవాడని, తన కోరిక తీర్చాలని ఒత్తిడి తెచ్చేవాడని తెలిపింది. తనను ఇబ్బందులకు గురి చేస్తున్న జగన్ అడ్డు తొలగించుకోవాలని తనకు సన్నిహితుడైన ఓ వ్యక్తితోపాటు మరొకరి సహాయం తీసుకున్నట్లు తెలిపింది. 2వ తేదీ రాత్రి కోరిక తీరుస్తానంటూ మున్నేరు శివారు శివాలయం సమీపానికి తీసుకెళ్లానని, అప్పటికే తన సమాచారం మేరకు అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులతో కలిసి బండరాళ్లతో తల, మెడపై కొట్టి చంపినట్లు ఒప్పుకుంది. దీంతో కోపోద్రికులైన తండావాసులు సదరు మహిళకు దేహశుద్ధి చేశారు. మెడలో చెప్పులదండ వేసి తండాలో ఊరేగించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

నిట్‌లో వింటర్ స్కూల్

- జియోస్పేషియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ నైపుణ్యానికి దోహదం
- నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు

కాజీపేట అర్బన్: జియోస్పేషియల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నైపుణ్యం సాధించేందుకు వింటర్ స్కూల్ ప్రోగ్రాం దోహదపడాలని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ క్యాంపస్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో సోమవారం నేషనల్ జియో స్పేషియల్ పాలసీలో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సౌజన్యంతో 'జియో స్పేషియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అంశంపై ఏర్పాటు చేసిన 21 రోజుల వింటర్ స్కూల్ ప్రోగ్రాంను నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిట్ వరంగల్ క్యాంపస్ వింటర్ స్కూల్‌కు వేదికగా నిలవడం అభినందనీయమన్నారు. ఈప్రోగ్రాంను సద్వినియోగపర్చుకుని, జియోస్పేషియల్ సైన్స్ రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అడ్వైజర్ డాక్టర్ దేబప్రియా దత్త వర్చ్యువల్‌గా పాల్గొని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్టీ ప్రతినిధులు డాక్టర్ కె.మృత్యుంజయ, ప్రొఫెసర్లు కేవీ.జయకుమార్, కే.వెంకటరెడ్డి, డాక్టర్ శశి, సైంటిస్టులు, రీసెర్చ్ స్కాలర్లు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లు పెంచాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావు

హన్మకొండ: రెవెన్యూ వసూళ్లు పెంచాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి హనుమకొండ, జనగామ, భూపాలపల్లి సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లు, డీఈలు ఏడీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా సీఎండీ ఎ.గోపాల్ రావు ప్రగతిని సమీక్షించారు. సీఎండీ ఎ.గోపాలరావు మాట్లాడుతూ దత్తత తీసుకున్న గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, వినియోగదారులతో మమేకం అవుతూ సందేహాలను తీర్చాలన్నారు. వ్యవసాయ సర్వీసుల మంజూరు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు వెంటనే స్పందించాలన్నారు. రెండు సంవత్సరాల పైబడిన వర్క్ ఆర్డర్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. హెచ్.టి. సర్వీసుల మంజూరు వేగవంతం చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్‌ను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు బి.వెంకటేశ్వర్ రావు. పి.సంధ్యరాణి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు మోహన్ రావు, అశోక్ కుమార్, కిషన్, సదర్ లాల్, డీ.ఈ ఐటీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులను అందజేస్తున్న రిజిస్ట్రార్, డీఈఓ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ విజేతలకు బహుమతులను అందజేశారు. నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, డీఈఓ అబ్దుల్‌హైలు ముఖ్యఅతిథులుగా హాజరై ఎల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ విజేతలకు నగదు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ మాధవిరెడ్డి, బత్తిని కొంరయ్య, వెంకటేశ్వర్‌రావు, వినయ్‌ధర్‌రాజు, సంపత్, శ్రీనివాస్, రమణ, రవికుమార్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల గుడిలో మహాశివరాత్రి ఉత్సవాలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈఓ శేషగిరి, గంగు ఉపేంద్రశర్మ, సీఐ శ్రీనివాస్‌జీ

హన్మకొండ కల్చరల్: శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల దేవాలయంలో ఈనెల 17 నుంచి 21 వరకు జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ ఈఓ. గుళ్లపల్లి శేషగిరి అన్నారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఈఓ శేషగిరి, ఆధ్యాత్మికవేత్తలు శివభక్తులు గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు వెంకటేశ్వర్లు, మండువ శేషగిరిరావు, హనుమకొండ సీఐ శ్రీనివాస్‌జీ పాల్గొని వేయిస్తంభాల దేవాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రావుల సుదర్శన్, పులి రజనీకాంత్, గండ్రాతిరాజు, గుడా భరత్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పాటుపడిన శోభారాణి



సంతాప సభలో మాట్లాడుతున్న జీవన్‌కుమార్



కేఎంసీలో శోభారాణి మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

- సంతాపసభలో మానవహక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జీవన్‌కుమార్

కేయూ క్యాంపస్: ప్రజాస్వామ్య వ్యవస్థలో మానవ హక్కుల కోసం నిరంతరం పాటుపడిన అధ్యాపకురాలు డాక్టర్ కందాల శోభారాణి అని మానవహక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జీవన్‌కుమార్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పార్ట్‌టైం అధ్యాపకురాలు, కవి, రచయిత్రి, మానవహక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షురాలు శోభారాణి ఈనెల 12న మృతి చెందిన విషయం విధితమే. సోమవారం కేయూ సమీపంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరచిన హక్కుల కార్యకర్త శోభారాణి మృతి సమాజానికి తీరని లోటన్నారు. అనంతరం కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ఆచార్యులు కాత్యాయనీ విద్మహే, ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు టి.జ్యోతిరాణి మాట్లాడారు. తొలుత శోభారాణి మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, బన్న అయిలయ్య, పంతంగి వెంకటేశ్వర్లు, శ్రీదేవి, లింగారెడ్డి, కుమారస్వామి, శ్రీధర్‌కుమార్‌లోథ్, ఝాన్సీ, రమ, ప్రజా సంఘాల బాధ్యులు ఉన్నారు. అనంతరం శోభారాణి అంతిమ యాత్ర కేయూ రెండోగేట్ నుంచి ఎస్‌డీఎల్‌సీఈ వరకు కొనసాగింది.

కేఎంసీకి శోభారాణి మృతదేహం అప్పగింత

ఎంజీఎం: కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కందాల శోభారాణి మృతదేహాన్ని కుమారులు, బంధుమిత్రులు సోమవారం కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా తెలంగాణ నేత్ర అవయవ దాత అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం కూడా శోభారాణి మృతదేహాన్ని కేఎంసీకి అప్పగించి ఎంతో మంది వైద్య విద్యార్థులకు విద్యాబోధనకు తోడ్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో కుమారుడు శ్రీకృష్ణ కౌశిక్, మిత్రులు కొమ్ముల సురేందర్, ప్రజాస్వామిక వాదులు రమాదేవి, విరసం నాయకులు కుమారస్వామి, చైతన్య మహిళా అధ్యక్షురాలు అనిత, రజిత, కేయూ ప్రొఫెసర్ కాత్యాయిని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.